# ఎన్నాళ్లీ కష్టాలు.?

- లోలెవల్ వంతెనలతో ప్రయాణికులకు ఇబ్బందులు
- వర్షాకాలంలో ఇవే తిప్పలు
- ప్రతిపాదనలకే పరిమితమైన హైలెవల్ వంతెనలు
- నిధుల మంజూరులో నిర్లక్ష్యం

చందుర్తి: వర్షం కురిస్తే చాలు మండలంలోని సగానికి పైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. 30 ఏళ్ల కిత్రం నిర్మించిన లోలెవల్ వంతెనలతో వర్షపు నీరు అధికంగా కావడంతో వాటిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో నాలుగేళ్లుగా వర్షాకాలంలో రెండు మాసాలపాటు ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. వీటి స్థానంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి మోక్షం లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాలుగైదేళ్ల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో లోలెవల్ పక్కనే ఉన్న రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా, ఫలితం శూన్యం. శాశ్వతంగా ఉండేందుకు హైలెవల్ వంతెనలు నిర్మించుకుంటే ఈ కష్టాలు తప్పుతాయని తెలిసి కూడా ప్రభుత్వం నిధుల మంజూరులో నిర్లక్ష్యం చేస్తోంది. పాలకులు మాత్రం వర్షాలు పడికొట్టుకుపోయినప్పుడు వచ్చి శాశ్వత పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం తప్ప, కార్యరూపం దాల్చడం లేదని చెప్పడానికి నాలుగేళ్లుగా అధిక వర్షాలతో ప్రజలు పడుతున్న కష్టాలే నిదర్శనం.


ఇటీవల వర్షాలకు బండపల్లి-బావుసాయిపేట గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై పరిస్థితి

## అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి

లోలెవల్ వంతెనతో మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో భారీ వర్షం పడిన రోజున ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే రోడ్డు సంబంధాలు తెగిపోతున్నాయి. చందుర్తి-కోనరావుపేట మండలాల సరిహద్దు గ్రామాలైనా బండపల్లి-బావుసాయిపేట మధ్యన, జలపతి తండా శివారులోని లోలెవల్ వంతెనలపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో చిన్నపాటి వర్షాలకే రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే జోగాపూర్-మర్రిగడ్డ గ్రామాల మధ్య, మూడపల్లి గ్రామ బస్టాండ్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డును అనుకుని మూడపల్లి గ్రామానికి వెళ్లేందుకు నిర్మించి వంతెన. చందుర్తి-రామన్నపేట ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన లోలెవల్ కల్వర్టు, చందుర్తి-మల్యాల గ్రామాల మధ్య లోలెవల్ కల్వర్టులు వర్షాకాలంలో ప్రజల పాలిటశాపంగా మారాయి. వీటి స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరినప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు.

## మత్తడి దూకితే ప్రయాణానికి బ్రేకులే..

చందుర్తి మండలం బండపల్లి ఊర చెరువును ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మినీ రిజర్వాయర్‌గా నిర్మించారు. ఈ రిజర్వాయర్ మూడేళ్లుగా నిండుకుండలా ఉంది. చిన్నపాటి వర్షాలు పడినఈ మినీ రిజర్వాయర్ మత్తడి దూకితే బండపల్లి-బావుసాయిపేట గ్రామాల మధ్య గల ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన లోలెవల్ వంతెనపై నుంచి నీరు పారితే రాకపోకలు స్తంభించిపోతున్నాయి. 40 ఏళ్ల క్రితం లోలెవల్ వంతెనను నిర్మించారు. నిర్మాణ సమయంలో మీటరు ఎత్తులో కడితే ఇబ్బందులు తప్పేవి. కాని అప్పటి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు అవగాహన రాహిత్యంతో నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడంలేదు. అలాగే రామన్నపేట గ్రామ శివారులో లొడి చెరువు మత్తడి దూకితే చందుర్తి-రామన్నపేట అర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పాటు చేసిన లోలెవల్ వంతెనపై అలుగు నీరు పారుతోంది. దీంతో రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగపూర్ అనంతపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్ అవుతున్నాయి. మూడపల్లి వంతెనతో మూడపల్లి గ్రామస్తులతో పాటు వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట, లింగంపల్లి, బొల్లారం, మల్లారం గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. జలపతి తండా శివారులోగల మాటుఒర్రె వరద నీటితో రెండు మీటర్ల నీటి ప్రవాహం వస్తుంది. జోగాపూర్-మర్రిగడ్డ గ్రామాల మధ్య గల ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న లోలెవల్ వంతెనతో మల్యాల రిజర్వాయర్ మత్తడి నీటి ప్రవహంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.

## ముందుచూపులేక తిప్పలు

కల్వర్టులు, వంతెనల నిర్మాణాల్లో ఆర్అండ్‌బీ అధికారులకు ముందుచూపులేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద ఉధృతి సమయంలో కల్వర్టు కింద పైపుల్లో కంప చెట్లకొమ్మలు తొలగించకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో వాటిపై నుంచి వర్షపు నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దానికి నిదర్శనం మూడు రోజుల క్రితం మల్యాల వంతెన వద్ద ఉన్న కంపచెట్లతో నీరు వంతెనపై నుంచి ప్రవహించడంతో పోలీసులు జేసీబీ సహాయంతో వాటిని తొలగించిన ప్రయాణికుల ఇబ్బందులను తీర్చారు.

## ప్రతిపాదనలకే పరిమితమైన హైలెవల్ వంతెనలు

ప్రతి వర్షాకాలంలో ప్రజలు వరదతో నీటితో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటే ఆధునికీకరణకు నిధులు కేటాయించేలా కృషి చేస్తామని చెప్పడమే తప్పా, ఆచరణలో పెట్టిన దాఖలాలు లేవని యువకులు సోషల్ మీడియా ద్వారా బహిరంగ విమర్శలు చేస్తున్నారు. అధికారులు మాత్రం ఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు పంపామని చెప్పి తప్పించుకోవడమే. ఆధునికీకరణ కాగితాలకే పరిమితమై పోవడంతో ప్రజలు, ప్రయాణికులు కష్టాలు పడే దుస్థితి నెలకొంది.

### లోలెవల్ కల్వర్టుతో ఇబ్బంది.



వర్షం పడిన ప్రతిసారి నాలుగైదు రోజుల వరకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. యాబై ఏళ్ల క్రితం నిర్మించిన లోలెవల్ కల్వర్టు కావడంతో వంతెనపై మీటరు ఎత్తుకు పైగా మత్తడి నీరు పోతుంది. బండపల్లి ఊర చెరువు మత్తడి చిన్నపాటి వర్షానికి దూకడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – లింగపల్లి బాబు, బండపల్లి

### హైలెవల్ వంతెనతో ఇబ్బందులుండవు



చిన్నపాటి వర్షానికే గ్రామానికి రాకపోకాలే నిలిచి పోతున్నాయి. వేములవాడ -కోరుట్ల ప్రధాన రహదారైనా చందుర్తి -మల్యాల గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై వెంగళి చెరువు మత్తడి దూకితే నీరు పైన నుంచి ప్రవహిస్తున్నాయి.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వంతెన ఎత్తును పెంచి ప్రయాణ కష్టాలను తీర్చాలి. – బొడ్డు కృష్ణ, యూత్ అధ్యక్షుడు, మల్యాల

### ప్రభుత్వానికి నివేదిక పంపాం



వర్షం పడితే ఇబ్బందులయ్యే వంతెనలను పరిశీలించాం. చిన్నపాటి వర్షానికి ఇబ్బందులుపడే గ్రామాల హైలెవల్ వంతెనల నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం ఎస్టిమెంట్లు తయారు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. నిధులు మంజూరైతే వంతెనల నిర్మాణాలను చేపడుతాం. – సతీశ్, ఆర్అండ్‌బీ ఏఈ, చందుర్తి

## క్లుప్తంగా

### క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం

ఎమ్మెల్యే రమేశ్‌బాబు


రాష్ట్ర వాలీబాల్ అకాడమీకి ఎంపికైన విద్యార్థి వేణును సన్మానించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

చందుర్తి: క్రీడల్లో రాణించే యువతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహన్ని అందిస్తుందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న సర్దాని వేణు అనే విద్యార్థిని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంగనర్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చెన్నమనేని శ్రీకుమార్, సీనియర్ క్రీడాకారులు ఈర్లపెల్లి రాజు, గంగం మహేశ్, నితీన్, మనోజ్, శ్రీనివాస్, హరీశ్, అభినయ్, రాహూల్ పాల్గొన్నారు.

### స్వాతికి సన్మానం


ఎస్సైగా సెలెక్ట్ అయిన కొప్పుల స్వాతిని సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

వేములవాడ: ఎస్సైగా ఎంపికయిన వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల స్వాతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల మహేందర్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. బీసీ బిడ్డగా కష్టపడి ఎస్సైగా ఎంపికవ్వడం బీసీలందరికీ గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో స్వాతి తల్లిదండ్రులు లింగమూర్తి, లావణ్య, బీసీ సంఘం నాయకులు మారవేణి మహేశ్, అరవింద్, నాంపల్లి, అంబటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.2.59 కోట్లు మంజూరు

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్లు ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ పూర్మాని మంజుల, ఎంపీపీ పడిగెల మానస తెలిపారు. పద్మనగర్ గ్రామం సిద్దిపేట ప్రధాన రహదారి నుండి వయా నాగుల ఎల్లమ్మ మీదుగా మండెపల్లి వరకు బీటీ రోడ్డు కొరకు రూ.2.25 కోట్లు, ఇందిరానగర్ నుంచి అంకుషాపూర్ వరకు వంతెనతో కూడిన బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.34 లక్షలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

### పాపన్న జయంతి ఉత్సవాలు

ముస్తాబాద్: మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ బహుజనులు రాజ్యాధికారం కోసం పాపన్న చేసిన ఉద్యమం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బాలారాజ్‌గౌడ్, కొండ రాములుగౌడ్, లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## నియామకం

### కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడిగా గండి నారాయణ

రుద్రంగి: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా గండి నారాయణను నియమించినట్లు పార్టీ బీసీ సెల్ చైర్మన్ కూస రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గండి నారాయణకు నియామకపత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. నాయకులు తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, సామ మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, దాస్, రాజలింగం, రవి, లచ్చిరెడ్డి, గంగనర్సయ్య పాల్గొన్నారు.

**బీసీ సెల్ అధ్యక్షుడిగా శంకర్**

కోనరావుపేట: మండల కాంగ్రెస్ బీసీ సెల్ ప్రెసిడెంట్‌గా కోనరావుపేటకు చెందిన మంగిలిపల్లి శంకర్‌ను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పత్రాన్ని అందజేశారు.

**చందుర్తిలో..**

చందుర్తి: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ చందుర్తి మండల అధ్యక్షుడిగా చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన పోతుగంటి రంజిత్‌కు నియామక పత్రాన్ని బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్ డీసీసీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అందజేశారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ బూత్ కమిటీలు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఇన్‌చార్జిలు అంకారపు రవీందర్, సిలివేరి చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా కొక్కిరాల ఆగం రావు, ఆవునూరి ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిలివేరి ప్రసూన పాల్గొన్నారు.

### మండెపల్లి రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రఘుపతి రెడ్డి



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి రెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం జరగగా అధ్యక్షుడిగా రాగిపల్లి రఘుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడు ఆసాని మైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాగిపల్లి భూపాలరెడ్డి, కోశాధికారి గనుప జీవన్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా నెబూరి సంజీవరెడ్డి, ఆసాని ప్రతాపరెడ్డి, అక్బల్లి గంగారెడ్డి, రాగిపల్లి ప్రతాపరెడ్డి, దర్మారెడ్డి రఘుపతిరెడ్డి ఎన్నికయ్యారు.

## చిత్రకథ



### రహదారి దుమ్మూ ధూళిమయం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక నుంచి వెంకట్రావుపల్లి వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా మట్టి పోశారు. విపరీతమైన రద్దీకి తోడు రోడ్డు పక్కలకు మట్టి పోయడంతో వాహనాలు వెళ్ల దుమ్మూ లేవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుమ్ము లేవకుండా రోడ్డుపై నీళ్లు చల్లాలని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి కొనుకటి హరీశ్ అధికారులను కోరారు.

# ఈ రోడ్డెప్పుడు నిర్మిస్తారో.?

- రెండు ఏళ్లుగా ఎక్కడి పనులు అక్కడే.?
- నిధులున్నా వ్యర్థమే..
- అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


గ్రామాల మీదుగా వెళ్లే లింకు రోడ్డు (ఫైల్)

వేములవాడరూరల్: నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించిన తరువాత ఆ పనులు ఎంతవరకు వచ్చాయో అనే పర్యవేక్షించడం అధికారుల నిర్లక్ష్యం మూలంగా రింక్ రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోయింది. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో రైతుల సౌకర్యార్థం గ్రామాలకు లింకు రోడ్డును ఏర్పాటు చేసి రోడ్డు పనులు ప్రారంభించారు. రైతుల్లో సమన్వయ లోపంతో రెండేళ్లుగా రోడ్డు పనులు నిలిచిపోయాయి.

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి వార్డు నుంచి రూరల్ మండలంలోని నాగాయపల్లి గ్రామం వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల వరకు లింకు రోడ్డుకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద దాదాపు రూ.3.15 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు 2021 సెప్టెంబర్ 15న ఎమ్మెల్యే రమేశ్ బాబు చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించగానే ఆ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ దారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత రోడ్డు మ్యాప్ ప్రకారమే రోడ్డు పనులు చేయాలని పనులను జరగకుండా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అప్పటి నుంచి పనులను నిలుపుదల చేసిన సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పనులు రైతుల అభ్యంతరాలతో పనులు నిలుపుదల చేయడంతో శాత్రాజుపల్లి, ఎదురుగట్ల, నాగాయపల్లి గ్రామాల ప్రజలతో పాటు వేములవాడ పట్టణానికి వచ్చే కోరుట్ల ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు పలుసార్లు రైతులతో మాట్లాడి రోడ్డు పనులకు ఎలాంటి అడ్డంకులు చేయవద్దని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పనులు చేస్తామని చెప్పినా, రైతుల మధ్య సమన్వయ లోపంతో పనులు మాత్రం జరగడం లేదు.

## రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు చెక్

వేములవాడ పట్టణానికి వివిధ గ్రామాల నుంచి రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఈ లింకు రోడ్డుతో వేములవాడ మీదుగా జగిత్యాలకు వెళ్లే వాహనదారులు వేములవాడ నుంచి కాకుండా నాగాయపల్లి గ్రామం నుంచి ఈ రోడ్డు వెంట ఎదురుగట్ల, శాత్రాజుపల్లి మీదుగా కొండగట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్యకు అడ్డు లేకుండా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యతో పాటు మూడు గ్రామాల రైతులకు ఈ రోడ్డుతో ఎంతో సొలభ్యంగా ఉంటుంది. గతంలో ఉన్న పాత రోడ్డు ద్వారానే కొత్తగా ఈ తారు రోడ్డును వేస్తున్నారు. ఈ రోడ్డు పక్కన ఉన్న రైతులకు ఈ రోడ్డు వల్ల దూరభారం తగ్గుతున్నప్పటికీ కొంత మంది రైతుల అభ్యంతరంతో పనుల్లో జాప్యం జరుగుతోందని, వారితో మాట్లాడే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

### చర్యలు తీసుకోవాలి



రైతుల అభ్యంతరంతో నిలిచిపోయిన రోడ్డు పనులను అందరితో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి. ఇప్పటికీ చాలామంది ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. – సోయినేని కరుణాకర్, సర్పంచ్, ఎదురుగట్ల

### రోడ్డుతో గ్రామాభివృద్ధి



ఈ లింకు రోడ్డుతో గ్రామం అభివృద్ధి చెందుతుంది. రైతుల భూములకు డిమాండ్ పెరగడంతో పాటు వారికి ఎంతో సొలభ్యంగా ఉంటుంది. రైతులందరూ సహకరించాలి. – టంపుల సుమన్, సర్పంచ్, నాగాయపల్లి

### రైతులతో మాట్లాడుతున్నాం



ఈ విషయంపై ఇప్పటికే రైతులతో మాట్లాడడం జరిగింది. అయినప్పటికీ కొంతమంది రైతులు అభ్యంతరాలు తెలిపిన విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. – సత్యనారాయణ, డీఈ, పంచాయతీరాజ్

# యుద్ధభేరికి తరలిన నాయకులు


రుద్రంగి: రాజకీయ యుద్ధభేరికి తరలుతున్న రుద్రంగి పద్మశాలీలు


సిరిసిల్లటౌన్: నినాదాలు చేస్తున్న పద్మశాలీ నేతలు

సిరిసిల్లటౌన్/ముస్తాబాద్/తంగళ్లపల్లి/బోయినపల్లి/రుద్రంగి/కోనరావుపేట: కోరుట్లలో నిర్వహించిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరికి ‘ఛలో కోరుట్ల’ కార్యక్రమానికి సిరిసిల్ల నుంచి ఆ సామాజికవర్గం నుంచి ప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. ఉదయం స్థానిక కొండ లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. పద్మశాలీల హక్కుల సాధనకై జరుగుతున్న కార్యక్రమానికి సిరిసిల్ల నుంచి భారీగా వెళ్తున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కౌన్సిలర్లు తరలివెళ్లారు. ముస్తాబాద్ మండల శాఖ అధ్యక్షుడు భరత్, బాలకిషన్, రాజమల్లయ్య, వజ్రానందం, నందు, ధర్మయ్య, మల్లేశం, తంగళ్లపల్లి నుంచి సర్పంచ్ అంకారపు అనిత, నాయకులు బొల్లి రామ్మోహన్, బైరి రమేశ్, రాపెల్లి ఆనందం, మచ్చ ఆంజనేయులు, బండి జగన్, మచ్చ శ్రీనివాస్, సట్కూరి నర్సయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు. కోనరావుపేట నుంచి మండలాధ్యక్షుడు చౌటపెల్లి వెంకటేశం, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గాజుల హరి తరలివెళ్లారు.

### గృహలక్ష్మి దరఖాస్తులపై విచారణ

కోనరావుపేట: మండలంలోని అజ్మీరాతండా, భుక్యారెడ్డితండా, సుద్దాల, కోనరావుపేట గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తులపై క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. ఆయా గ్రామాల్లో గృహలక్ష్మి పథకంలో ఇల్లు కట్టుకునేందుకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో జోగం రాజు, పంచాయతీరాజ్ ఏఈ అంజయ్య, మండల పరిషత్ పర్యవేక్షకులు శంకర్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఏఈవోలు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను ఓదార్చిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి, దాచారం, తాళ్లపల్లి గ్రామాలకు చెందిన సింగిరెడ్డి భరత్‌రెడ్డి, పల్లె ధర్మారెడ్డి, బిట్ల దేవయ్య, పొన్నం లక్ష్మిపతి ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందగా మృతుల కుటుంబాలను మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచులు పద్మ, వాణి, పర్శరాం, ఇల్లంతకుంట ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య పాల్గొన్నారు.

### పరామర్శ

గంభీరావుపేట: ఈత చెట్టు నుంచి జారిపడి గాయపడిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గంట అంజాగౌడ్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు పర్శరాములుగౌడ్, లక్ష్మణ్, బాలాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సిరిసిల్లకు చెందిన శిరీషా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పి. లీలా శిరీషా వివిధ జబ్బులతో బాధపడుతున్న మహిళలకు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, వార్డు సభ్యులు ఎగ్గె లావణ్య, తాళ్లపెల్లి ప్రభాకర్, ఆర్ఎంపీ వైద్యులు బర్మ లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

### 17న మండల సర్వసభ్య సమావేశం

వేములవాడరూరల్: ఈ నెల 17న వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.